# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నేటితో ఏడాది గడిచిన పెహల్గాం ఉగ్రదాడి ఘటనను స్మరించుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉగ్రవాదం ముందు భారత్ ఎన్నటికీ తలొంచబోదని స్పష్టం చేశారు.
- ❖ దేశ ప్రజలు సుస్థిర జీవనశైలిని అలవర్చుకుని స్వచ్ఛమైన భవిష్యత్ కోసం కలిసికట్టుగా పని చేయాలని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ సూచించారు.
- ❖ తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రేపు జరగనుంది.
- ❖ దేశంలో ఎల్‌పిజి, పిఎన్‌జి, పెట్రోల్, డీజిల్ సరఫరా స్థిరంగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ము కాశ్మీర్ పెహల్గాంలో ఉగ్రదాడి జరిగి ఈరోజుతో ఏడాది పూర్తయ్యింది. ఆ చీకటి రోజును స్మరించుకుంటూ... ఉగ్రవాదం ముందు భారత్ ఎన్నటికీ తలొంచబోదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదుల హేయమైన కుట్రలు ఎప్పటికీ విజయవంతం కావన్నారు. ఉగ్రవాదాన్ని తుదిముట్టించే విషయంలో భారత్ కృతనిశ్చయంతో ఉందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొంటూ.. పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు నివాళులర్పించారు. భారత్ దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని భరిస్తున్నప్పటికీ, నేడు దాని స్పందన మాత్రం దృఢంగా, నిర్ణయాత్మకంగా ఉందని దేశానికి తగిలిన గాయాలను ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. ఆస్ట్రేలియా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాలు పహల్గామ్ ఉగ్రదాడి బాధితులను స్మరించుకుంటూ భారతదేశానికి సంఘీభావం తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా భూమండలాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ తమ నిబద్ధతను పునరుద్ఘాటించాలని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ కోరారు. భారతీయ సంస్కృతి ఎప్పటినుంచో ప్రకృతితో సామరస్యాన్ని కలిగి ఉందని ఆయన ఈరోజు ఒక సామాజిక మాధ్యమ పోస్ట్‌లో గుర్తు చేశారు. తమిళ కవి

తిరువళ్లువర్ చెప్పిన ఒక సూక్తిని ఉటంకిస్తూ.. భూ వనరులను ఆలోచనాత్మకంగా పంచుకొని ఉపయోగించడం ద్వారా సకల జీవులను సంరక్షించడమే `విభిన్న జీవవైవిధ్యం` అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణ సవాళ్లను నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న తరుణంలో దేశ ప్రజలు సుస్థిర జీవనశైలిని అలవర్చుకుని.. పచ్చని, స్వచ్ఛమైన భవిష్యత్ కోసం కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రతి చిన్న అడుగు ముఖ్యమైనదే కాబట్టి.. భూమండలాన్ని కేవలం ఈరోజు మాత్రమే కాకుండా ప్రతిరోజూ గౌరవించాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రేపు జరగనున్నాయి. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే దశలో పోలింగ్ జరగనుంది. ఆ రాష్ట్రంలో 5 కోట్ల 73 లక్షల 43 వేల కంటే ఎక్కువ మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పశ్చిమ బెంగాల్ మొదటి దశలో భాగంగా రేపు 16 జిల్లాల వ్యాప్తంగా ఉన్న 152 స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో మొత్తం 1,478 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ వచ్చే బుధవారం జరగనుందని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇదిలా ఉండగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తో పాటూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన వెయ్యి కోట్ల రూపాయలకు పైగా విలువైన నగదు, మద్యం, వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. పశ్చిమాసియా సంఘర్షణపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... దేశంలో ఎల్‌పిజి, పిఎన్‌జి, పెట్రోల్, డీజిల్ సరఫరా స్థిరంగా కొనసాగేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకుందని చెప్పారు. గృహ వినియోగ ఎల్‌పిజి సరఫరా సాధారణంగా ఉందని, నిన్న 45 లక్షలకు పైగా బుకింగ్‌లు నమోదయ్యాయని, సుమారు 51 లక్షల గృహ వినియోగ ఎల్‌పిజి సిలిండర్లు పంపిణీ చేయబడ్డాయని తెలిపారు. 8 వేల టన్నులకు పైగా వాణిజ్య ఎల్‌పిజి నిన్న ఒక్కరోజే అమ్ముడైందని సుజాత శర్మ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

జర్మనీలో పర్యటిస్తోన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బెర్లిన్‌లో జర్మనీ ఫెడరల్ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్‌ను ఈరోజు కలిశారు. రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్తగా తలెత్తుతున్న భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడం సహా పలు అంశాలపై ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రక్షణ పారిశ్రామిక కార్యాచరణతో పాటూ.. ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణలో సహకారం కోసం ఒక అమలు ఒప్పందంపై సంతకాలు చేయడాన్ని కూడా ఈ సందర్భంగా సమీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ఇథనాల్, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ వంటి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `సేవ్ ది ఎర్త్ కాన్‌క్లేవ్` రెండవ ఎడిషన్‌లో ఆయన ప్రసంగిస్తూ... నేడు వాతావరణ మార్పులు, పర్యావరణ క్షీణత మానవ జీవనానికి తీవ్రమైన సవాళ్లను విసురుతున్నాయని, ఇటువంటి తరుణంలో

కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలన్నారు. రీసైక్లింగ్, బయో-ఎనర్జీ ఉత్పత్తి ద్వారా వ్యర్థాలను సంపదగా మార్చవచ్చని చెప్పారు. రైతులను కేవలం ఆహార ప్రదాతలుగానే కాకుండా, ఇంధన ఉత్పత్తిదారులుగా కూడా బలోపేతం చేయాలని నితిన్ గడ్కరీ ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో జరుగుతున్న జనగణన-2027 మొదటి దశలో ఇప్పటివరకు 26 లక్షలకు పైగా కుటుంబాలు `స్వీయ-గణన` సదుపాయాన్ని వినియోగించుకున్నాయి. జనగణన డిజిటల్ చొరవ పట్ల పౌరుల భాగస్వామ్యం పెరుగుతుందనటానికి ఇది ఒక నిదర్శనమని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ పేర్కొన్నారు. తమ వివరాలను ఆన్‌లైన్ లో అందించడం ద్వారా ఈ కుటుంబాలు దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడానికి వేగవంతమైన, అత్యంత అనుకూలమైన మార్గాన్ని ఎంచుకున్నాయన్నారు. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, బీహార్ రాష్ట్రాల్లో ఈ సదుపాయం కొనసాగుతోందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు ఆరు నెలల శీతాకాల విరామం తర్వాత తిరిగి ఈరోజు తెరుచుకున్నాయి. ఈ ఉదయం వేద మంత్రోచ్చారణలు, శంఖారావాల మధ్య బాబా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోవడంతో చార్‌ధామ్ యాత్రలో కీలక ఘట్టం ప్రారంభమైంది. ఆలయ ద్వారాలు తెరుచుకున్న సమయంలో దేశ, విదేశాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు చేసిన `హరహర మహాదేవ్`, `జై శివ శంకర్` నినాదాలతో హిమాలయ పర్వత ప్రాంతంలో ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంది. భక్తుల సౌకర్యార్థం రుద్రప్రయాగ్ జిల్లా యంత్రాంగం, బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్రకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కేదార్‌నాథ్ తో పాటు బద్రీనాథ్, గంగోత్రి.. యమునోత్రి దర్శనం కోసం ఇప్పటి వరకు 14 లక్షల 60 వేల మందికి పైగా భక్తులు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కేదార్‌నాథ్, చార్‌ధామ్ యాత్రలు దేశ సుసంపన్న సంప్రదాయాలకు ఒక దివ్యమైన వేడుక అని, ఈ యాత్రలు భారతదేశ నిత్య సంస్కృతిని కళ్లకు కట్టినట్లు చూపిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలనుద్దేశించి రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య లక్నో లోని ఏక్నా స్టేడియం వేదికగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో రియాన్ పరాగ్ నేతృత్వంలో బ్యాటింగ్ ప్రారంభించిన రాజస్థాన్ రాయల్స్ జట్టు 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =